క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన న్యాయవాదులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగర నియోజకవర్గ కార్యాలయంలో జిల్లా కోర్టు న్యాయవాదులు బుధవారం కలిశారు. కోర్టు ఆవరణలో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ఆయనకు వివరించారు. న్యాయవాదులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ తెలిపారు.

అక్టోబర్ 5న శిక్షణ

నెల్లూరు(బారకాసు): బిజినెస్ మైండ్‌సెట్ మాస్టర్ కార్యక్రమంపై అక్టోబర్ 5వ తేదీన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సైకాలజిస్ట్ అండ్ కోచ్ సింగంశెట్టి అభిషేక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నర్తకి సెంటర్‌లోని నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరపురం సమీపంలోని నెల్లూరు పినాకిని కన్వెన్షన్ హాల్లో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. వ్యాపారంలో ఎలా విజయం సాధించాలి అనే అంశంపై మెళకువలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ అయితా భాస్కర్, సెక్రటరీ టి.విశ్వనాథ్, ట్రెజరర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీడీ



నెల్లూరురూరల్: జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం కలెక్టర్ హిమాన్షు శుక్లాను, జేసీ కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారు మూడో రోజు బుధవారం విద్యుత్ భవన్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీధర్, దామోదర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నవాబ్‌జానీ, రఫీ, కృష్ణ, హజరత్‌వలీ, నాంచారయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అండర్-14, 17 రెజ్లింగ్ క్రీడా ఎంపికలు బుధవారం నిర్వహించారు. కావలి ఓల్డ్‌టౌన్ మున్సిపల్ పాఠశాలలో గురువారం అండర్-14, 17 సైక్లింగ్ ఎంపికలు జరుగనున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రమణయ్య తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మారెడ్డి సురేంద్రరెడ్డి తండ్రి సీతారెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని వారి నివాసానికి వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం వెళ్లి సురేంద్రరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. 16వ డివిజన్ ఇన్‌చార్జి సగిలి జయరామిరెడ్డి, పార్టీ నేతలు శశిధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, శేషన్న, రామిరెడ్డి, శ్రీను ఉన్నారు.

డబ్బులివ్వలేదని దాడి

నెల్లూరు(క్రైమ్): తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడిచేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు టైలర్స్ కాలనీలో చిన్నబ్రహ్మయ్య బైక్ మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి పొదలకూరు మండలం మరుపూరుకు చెందిన బైక్ మెకానిక్ దాదా స్నేహితుడు. బ్రహ్మయ్య తన అవసరాల నిమిత్తం రెండునెలల క్రితం స్నేహితుడి వద్ద రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. అయితే ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో తీసుకున్న అప్పు సకాలంలో చెల్లించలేకపోయాడు. మూడురోజుల క్రితం దాదా డబ్బుల విషయమై నిలదీయగా 18వ తేదీన ఇచ్చేస్తానని బ్రహ్మయ్య చెప్పాడు. అయితే ఈనెల 16వ తేదీన బ్రహ్మయ్య గాంధీ రోశయ్య నగర్‌లోని తన షాపు వద్ద ఉండగా దాదా అక్కడికి చేరుకుని డబ్బుల విషయమై గొడవ పడ్డాడు. పక్కనే ఉన్న ఇనుపరాడ్డుతో బ్రహ్మయ్య తలపై దాడిచేసి పరారయ్యాడు. గాయాలపాలైన బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొందాడు. వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వైద్యవిద్యపై కూటమి కుట్రలు దారుణం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను ప్రైవేటుపరం చేసే కుట్రలు దారుణమని, దీనిపై ఈనెల 19న చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైద్యం విషయంలో పేదలు ఇబ్బంది పడకూడదని, పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకున్నారన్నారు. మా ప్రభుత్వ హయాంలో ఏడు కాలేజీలను పూర్తి చేయడంతో పాటు ఐదు కాలేజీల్లో అడ్మిషన్స్ కూడా జరిగిందని, మిగిలిన 10 కాలేజీలలో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అయితే చంద్రబాబు అధికారం చేపట్టిన తొలిరోజు నుంచి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వ్యవస్థలను నిర్వీర్యం చేసే ఉద్దేశంతో పని చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని ఆలోచన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2019 వరకు కేవలం 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే జగనన్న అధికారం చేపట్టిన తర్వాత 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకొచ్చారన్నారు. కానీ 2024లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడా కొత్త మెడికల్ కాలేజీలే కట్టనట్టు, అసలు తీసుకురానట్టు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏడు మెడికల్ కాలేజీలు పూర్తయి భవనాలు కళ్లకు కనిపిస్తున్నా అసలు నిర్మాణమే జరగలేదని చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ప్రతిఒక్కరూ ఖండిస్తున్నట్లు తెలిపారు. 2019–2024 మధ్య కాలంలో మెడికల్ కాలేజీల కోసం ఏ ప్రాంతంలో ఎంత భూమి కేటాయించారు, ఎన్ని నిధులు వెచ్చించారు రికార్డులతో సహా మీ దగ్గరే ఉందన్నారు. పేద ప్రజలకు మీరు చేస్తున్న అన్యాయాలను గమనిస్తున్నారని, మీ బినామీలకు దోచి పెట్టేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాలను మా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మేమందరం కలిసికట్టుగా అడ్డుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువకులు

అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మరు

నెల్లూరు సిటీ: ఎంత మంది ఆనం విజయకుమార్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆనం విజయకుమార్‌రెడ్డితో తిరిగిన వ్యక్తులు నేడు ఆయనపై బురద చల్లడం సమంజసం కాదన్నారు. బత్తల కృష్ణ, గంగి జయరామిరెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి దగ్గరున్న మరి కొందరు నాయకులు గతంలో విజయకుమార్‌రెడ్డి దగ్గర పనిచేసినట్లు గుర్తుచేశారు. ఎవరి కళ్లలో ఆనందం చూడటానికి బత్తల కృష్ణ ఆనం విజయకుమార్‌రెడ్డిని నిందించడం సరికాదని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రూరల్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

నెల్లూరు (టౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి దసరా కానుకగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ 2023 జూలై నుంచి అమలు కావాల్సి ఉందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీర్సీసెంటర్): రంగనాథం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుకడొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వేస్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నగరంలో సమైక్యతా దినోత్సవం

నెల్లూరురూరల్: జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని బీజేపీ నేతల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందన

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్‌ను ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

హిందీ భాషను నేర్చుకుందాం

నెల్లూరు(అర్బన్): హిందీ భాషను ప్రతిఒక్కరూ నేర్చుకుందామని ఎల్‌ఐసీ సిటీ బ్రాంచ్-1 మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జాతీయ హిందీ దివస్‌ను నగరంలోని డివిజనల్ కార్యాలయంతో పాటు సిటీ బ్రాంచ్-1, 2, సీఏబీ బ్రాంచ్‌లలో బుధవారం అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా దర్గామిట్ట బ్రాంచ్‌లో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ హిందీ నేర్చుకుంటే దేశంలో ఎక్కడైనా రాణించవచ్చన్నారు. ఏఏఓ బాలకృష్ణ, అశోక్, దశరథ్, గోపి, రేవతి, జిషా, రజని, మస్తానమ్మ, అనిత పాల్గొన్నారు.



దర్గామిట్ట ఎల్‌ఐసీ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మానవతావాది జాషువా

నెల్లూరు(బృందావనం): మహోన్నత మానవతావాది గుర్రం జాషువా విద్వత్కవిగా కీర్తి ప్రతిష్టలు గడించారని తిరుపతి ఎస్వీ వర్సిటీ తెలుగు అధ్యయనశాఖ అధిపతి డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో బుధవారం రాత్రి 'గుర్రం జాషువా కవిత్వం.. మానవీయ దృక్కోణం' అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జాషువా కవిత్వాలు చిరస్మరణీయమన్నారు. అనంతరం బ్రహ్మానందరెడ్డిని సన్మానించారు. నిర్వాహకుడు శేషగిరీశం, కె.కుసుమకుమారి, విశ్వనాథం, సుబ్బరాయుడు, నారాయణస్వామి, కేపీఎస్, ఖాసీం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రత.. ప్రతిఒక్కరి బాధ్యత

నెల్లూరు(బారకాసు): పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలందరూ బాధ్యత పెంచుకోవాలని నగరపాలక కమిషనర్ నందన్ ఆకాంక్షించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా స్థానిక వీఆర్సీ మైదానం నుంచి గాంధీ బొమ్మ వరకు బుధవారం ఉదయం అధికారులు ర్యాలీని చేపట్టారు. కమిషనర్ నందన్ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా ఇంటింటి చెత్త సేకరణకు తోడ్పడాలని, నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టీపీఆర్ఓ వాసుబాబు సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ట్రేడ్ లైసెన్సులు చెల్లించేలా చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అన్ని వ్యాపార లావాదేవీలు ట్రేడ్ లైసెన్సులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ విభాగంతో వారాంతపు సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడారు. ఈనెల 20న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. పబ్లిక్ హెల్త్ కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, టీపీఆర్ఓ వాసుబాబు పాల్గొన్నారు.

➡ పార్కుల్లో పచ్చదనం, క్రీడా పరికరాలు, ఆట వస్తువులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్, మూడు జెండాల సెంటర్, 13వ డివిజన్ పాత మిట్టపాళెం, బలిజపాళెం, యలమవారి దిన్నె, 14వ డివిజన్ వేపదొరువు ప్రాంతాల్లోని మున్సిపల్ పార్కులను ఆయన బుధవారం సందర్శించారు. ఆయా పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

➡ భగత్‌సింగ్ కాలనీలో ఆక్రమణలపై కమిషనర్ నందన్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలన్నారు. అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్, సిటీ ప్లానర్ హిమబిందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

పేజావర మఠం పీఠాధిపతి ఆగమనం

నెల్లూరు(బృందావనం): సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజమఠాన్ని ఉడుపి పేజావర మఠం పీఠాధిపతి, అయోధ్య రామజన్మభూమి కమిటీ సభ్యుడు విశ్వప్రసన్నతీర్థుల వారు బుధవారం సందర్శించారు. మఠం నిర్వాహకులు పూర్ణకుంభంతో ఆయనకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి భాగవత ప్రవచనాన్ని అనుగ్రహభాషణ చేశారు. శాస్త్రోక్తంగా ముద్రాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి భక్తులకు మంగళశాసనాలు అందించారు. మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు అరవపల్లి సుబ్బారావు, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్ఠానం గౌరవ కార్యనిర్వాహకుడు కంబాలూరు శ్రీధర్‌ఆచార్య, రాఘవేంద్రస్వామి మఠం కార్యనిర్వాహకుడు కులకర్ణి, మధ్వసంఘం అధ్యక్షుడు దేవర్స్ ప్రవీణ్, పురంధరదాసు భజన మండలి అధ్యక్షుడు నాగరాజారావు, అర్చకుడు వైభవాచార్ తదితరులు పర్యవేక్షించారు.



టిప్పర్ యజమానులను అరెస్ట్ చేయాలి

• మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సంగం మండలం పెరమన వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్ యజమానులను వెంటనే అరెస్ట్ చేయాలని 16వ డివిజన్ సీపీఎం కార్యదర్శి కాయంబు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సీపీఎం నాయకులు వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాలను తరలించిన ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి వద్ద రాత్రి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదంలో 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘం ప్రాంతానికి చెందిన సారమ్మ, వెంగయ్యతో పాటు మరో ఐదుగురు మృతిచెందగా వారి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ యజమానులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ముత్తుకూరు గేటు వద్ద మృతదేహాలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన చేస్తున్న నగర సీపీఎం నాయకులు

చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు (టౌన్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఐలు కృష్ణారెడ్డి, సుబ్బారావు తెలిపారు. స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల క్రైమ్‌లకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం శక్తి యాప్, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, యాంటీ ర్యాగింగ్, రోడ్ సేఫ్టీ, డయల్ 112 తదితర వాటి గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్సైలు శ్రీహరి, సతీష్, ప్రిన్సిపాల్ రామారావు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. నారాయణ మెడికల్, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. నారాయణ వైద్య విద్యా సంస్థల డీన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలనుసారం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు తమ కళాశాలలో మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. మెడికల్ అడిషనల్ సూపరింటెండెంట్ మల్లి దొరసానమ్మ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ విశ్వకుమార్, సైకియాట్రిక్ వైద్యులు శేషమ్మ, బ్లడ్‌బ్యాంకు విభాగాధిపతి యశోవర్ధన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కార్తీక్, హాస్పిటల్ ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మందుల దుష్ప్రభావాలపై అవగాహన అవసరం

నెల్లూరు(అర్బన్): పలు రకాల వ్యాధులకు సంబంధించి మందులను ఇష్టారీతిన వినియోగిస్తే వచ్చే దుష్ప్రభావాలపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి అన్నారు. నగరంలోని ఏసీఎస్సార్ మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లో ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాల ప్రారంభ సందర్భంగా ఆ విభాగానికి చెందిన హెచ్ఓడీ రాధికారాణి ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఏదైనా మందులు వాడినప్పుడు కడుపునొప్పి, అలెర్జీ, దద్దుర్లు, వికారం లాంటి లక్షణాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. మందులకు సంబంధించి హెల్ప్‌లైన్ నంబర్ 1800 180 3024 ద్వారా ఉచితంగా సలహాలు పొందాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, ఫార్మకాలజీ విభాగపు డిప్యూటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ మునీర్‌ఖాన్ పాల్గొన్నారు.



సాల్ట్ ప్రాజెక్ట్ రద్దుకు డిమాండ్

నెల్లూరు (టౌన్): సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రణభేరిలో భాగంగా నెల్లూరు నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి రాష్ట్రంలో బడులను నడపడం వల్ల పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అవుతారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధరరావు, కార్యదర్శులు బాలరాగయ్య, నాగిరెడ్డి, ఖాజావలీ, సురేంద్రబాబు, మధుసూదనరావు, అనిల్‌కుమార్, శైలజ పాల్గొన్నారు.



దివ్యశిల్పి విశ్వకర్మ మహర్షి

నెల్లూరు రూరల్: యావత్ ప్రపంచానికి శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అందించిన దివ్యశిల్పి విశ్వకర్మ మహర్షి అని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విశ్వకర్మ జయంతిని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శిల్పకళా నైపుణ్యం, నిర్మాణ రూపకల్పన, దేవతల రథాలు, ఆయుధాల తయారీకి ఆద్యుడిగా విశ్వకర్మ పూజలందుకుంటున్నారన్నారు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం ప్రదర్శించిన గొప్ప మహర్షిగా విశ్వకర్మ ఖ్యాతి గడించారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం, ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిశ్రమలశాఖ, బీసీ వెల్ఫేర్ అధికారులు లబ్ధిదారులకు రుణాల మంజూరు, వృత్తినైపుణ్యం పెంపొందించడం, మార్కెటింగ్ సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, విశ్వబ్రాహ్మణ సేవాసంఘం నేతలు వెంకటశేషయ్య ఆచారి, సుబ్రహ్మణ్యం ఆచారి, చంద్రశేఖర్ ఆచారి, శ్రీహరి, పద్మ, శైలజా, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విశ్వకర్మ గొప్పతనాన్ని డీసీఓ గుర్రప్ప వివరించారు.

➡ నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్వకర్మ మహర్షి జయంతి బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏఎస్పీ సౌజన్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచానికి శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అందించిన దివ్యశిల్పి విశ్వకర్మ మహర్షి అని కొనియాడారు. ఎస్బీ, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి, డీటీసీ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు మిద్దె నాగేశ్వరమ్మ, రామారావు, ఆర్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బృందావనం): బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతిని, ప్రధాని మోదీ పుట్టినరోజును బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ర్యాలీగా పురమందిరానికి చేరుకుని విశ్వకర్మ చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ సంఘ్‌చాలక్ పల్నాటి రామదండు నివాళులర్పించారు.

➡ విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. తొలుత పంచవృత్తుల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానంలో పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నిర్వాహకులు కందుకూరు చంగయ్య ఆచారి, ఇందుకూరు రమేష్ కుమార్ ఆచారి, అలిమెలి మణిఆచారి, దండపాణి సురేష్ ఆచారి, విగ్రహాల బాలకృష్ణాచారి, కందుకూరు జనార్దనాచారి, బల్లవోలు రమణయ్య ఆచారి పర్యవేక్షించారు.

➡ ములుముడి బస్టాండ్ సెంటర్‌లో కంసాలివీధిలోని హరిహరనాథ స్వామి దేవస్థానంలో విశ్వకర్మ పూజా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుమ్మడిపూడి కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. సంఘ నేతలు వాకాటి కోటేశ్వరాచారి, ఆనంద్‌కుమార్, లక్ష్మీప్రసాద్, జయశంకర్, కందుకూరు శ్రీనివాస్, ఆర్కాట్ మురళి, సురేష్, శివ, శరత్, రమేష్, రాధాకృష్ణ, బాలాజీ, హర్షవర్ధన్, రతన్‌చంద్, శారద పాల్గొన్నారు.

➡ నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావులు భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు.



మాట్లాడుతున్న జేసీ కార్తీక్



డీసీఓ కార్యాలయంలో..



పంచవృత్తుల పతాకావిష్కరణ



హరిహరనాథస్వామి దేవస్థానంలో..



జిల్లా పోలీస్ కార్యాలయంలో..



బీజేపీ ఆధ్వర్యంలో..



జెడ్పీ కార్యాలయంలో..